క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది నామాల ప్రసాద్, సత్తి బాబు, కోళ్ల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సామూహిక లక్ష కుంకుమార్చన


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

అనపర్తి: గ్రామంలోని దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి వారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం గురుస్వామి పడాల సత్తి రెడ్డిరాజు ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. పురోహితులు రాందేవ్‌శర్మ, ధనుంజయ్‌శర్మ పర్యవేక్షణలో ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మ రాజేశ్వరి, సత్తిబాబు దంపతులు పీఠలపై కూర్చుని పూజ ప్రారంభించారు. సుమారు 150మంది ముత్తైదువులు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులకు పసుపు కుంకుమ అమ్మవారి ప్రతిమ మొదలగు పూజ సామగ్రి అందించారు. వచ్చే నెల కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప స్వామివారి ఆల ప్రాంగణంలో జరగబోయే కుంకుమ పూజలు, పడిపూజ కార్యక్రమంలో భక్తుల పాల్గొవాలని రాజు గురుస్వామి తెలిపారు.

ప్రధానోపాధ్యాయునికి సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం కోలా సత్యనారాయణను ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులందరూ విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేరిమాత, ఉల్లి రామకృష్ణ, వి.సుబ్బలక్ష్మి, శ్రీనివాసరావు, జె.మోహన్‌రావు, సత్యనారాయణ, రత్నప్రసాద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొరబాబు పాల్గొన్నారు.

పాము కాటుకు భయపడాల్సిన అవసరం లేదు

రంగంపేట: పాము కాటుకు భయపడాల్సిన అవసరం లేదని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల పాము కాట్ల ఘటనలు కొన్ని చోట్ల నమోదవుతున్నాయి. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. పాము కాటు చికిత్సకు కావలసిన ఆంటీ స్నేక్ వెనమ్ (ఎఎస్‌వీ) ఇంజెక్షన్లు రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైతే వెంటనే స్థానిక పీహెచ్‌సీ రావాలన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

రంగంపేట: ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని 1998 ఉపాధ్యాయులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు ముత్యాల శ్రీనివాసరావు, రమేష్ నాయుడు, మోహనరెడ్డి, ప్రకాష్ తదితరులు కోరారు. రాష్ట్రం మొత్తంలో 4,072 మంది, జిల్లాలో 235 మంది 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అందరినీ రెగ్యులర్ చేయాలని, పింఛను సౌకర్యం కల్పించాలన్నారు. దీనివల్ల కొంత మేరకు తమకు ఉద్యోగ భద్రత లభిస్తుందని చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతూ రాష్ట్ర సంఘ పిలుపు మేరకు రంగంపేట, జగ్గంపేట, గండేపల్లి మండలాల సంఘ నేతలంతా విజ్ఞాపన సభకు హాజరుకావాలని వారు కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

కోరుకొండ: బూరుగుపూడి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి మంగళవారం అందజేశారు. లబ్ధిదారులు బోగిళ్ల రాంబాబు, మూతిన సత్యనారాయణ, కాతేటి జార్జిల ఇంటికెళ్లి పరామర్శించి, చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కంటే నాగకేశవరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పశు బీమా ఏదీ?

- ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే పాడి రైతుకు తీవ్ర నష్టం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో పాడి రైతులు


పశువులు

పెదపూడి: పాడి రైతులకు అండగా నిలిచే పశు బీమా పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. పాడిని నమ్ముకుని జీవించే రైతాంగం కష్టాలు పడుతోంది. వర్షాకాలం కావడంతో అనుకోని విపత్తులతో పశువులు మత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో పశుబీమా కొంత ఊరటనిస్తుంది. అయితే అలాంటి బీమాను ఈ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా అమలు చేయడంలేదు. దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాధుల కాలం

వర్షాకాలంలో గేదెలు, ఆవులు, జీవాలకు హెచ్‌ఎస్ బీక్యూ, గాలికుంటు, థైలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాణాంతక వ్యాధులు సోకడం వల్ల పశువులు మత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుదాఘాతాలు సంభవించినప్పుడు పశువులు ఎక్కువగా మత్యువాత పడుతున్నాయి. లక్ష రూపాయలు అప్పు చేసి కొనుగోలు చేసిన పశువులు మృతి చెందితే ఆ రైతు పడేబాధ వర్ణనాతీతంగా ఉంటుంది. పశుబీమా ద్వారా సాయం అందితే కొంత ఉపశమనం కలుగుతోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో పశు బీమా పథకం పక్కాగా అమలు జరిగింది. పాడి పశువు మృతి చెందితే రూ.15వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం అందించి ఆదుకుంది. ప్రభుత్వం తరఫున పశువైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేవారు. అందులో రైతు వాటా కింద 3.5 శాతం బీమా ప్రీమియం ఉండేది. దీని వలన రైతుకు కొంత మేర ఉపయోగంగా ఉండేది. క్షీర సార పథకం ద్వారా 6, 7 నెలల చూడితో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా సౌకర్యం లేకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తూతూమంత్రంగా అమలు చేసి, గత నాలుగు నెలల నుంచి మొత్తం పశుబీమా అమలు చేయడంలేదు. దీనికి సంబంధించి ఇంత వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వక పోవడం శోచనీయం.

నష్టపోతున్నాం



పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. ప్రమాదవశాత్తు జీవాలు మత్యువాత పడితే పూర్తిగా నష్టపోతాం. రెండు పాడి ఆవులు కొనాలంటే ఇప్పుడు రూ.లక్షన్నర ఖర్చు అవుతోంది. పశుపోషణ కూడా భారంగా మారింది. ఇలాంటి సమ యంలో బీమా సౌకర్యం లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

– ఎస్.వెంకటేశ్వరరావు, రైతు కాండ్రేగుల గ్రామం

పాడి రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలి. శాశ్వత ప్రణాళిక ప్రయోజనం కల్పించాలి. తక్షణమే కూటమి ప్రభుత్వం పశు బీమా సౌకర్యాన్ని అమలు చేయాలి

– సాంబత్తుల చంటి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్

అనపర్తి నియోజకవర్గంలో

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, రంగంపేట, బిక్కవోలు, పెదపూడి మండలాల్లో ఉన్నాయి. ఈ మండలాల్లో మొత్తం ఆవులు 12,244, గేదేలు 35,932 ఉన్నాయి.

అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత


మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి రాంబాబు

రాజానగరం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని భారత ప్రభుత్వం విజిలెన్స్ డే గా జరుపుకొంటున్నామని విజిలెన్స్ అధికారి ఈ రాంబాబు అన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంకు, దివాన్‌చెరువు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పాలచర్ల, జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో అందరి బాధ్యత ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా రెండు నెలలపాటు అవినీతికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం జి. శ్రీనివాసరావు, బీఎం పి.రత్నకుమారి, హెచ్‌ఎం జి.సీతారామయ్య, యూనియన్ నాయకులు సీహెచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దాడులకు భయపడేది లేదు..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతూ అక్రమ కేసులు పెట్టి వేధిస్తూ లోకేష్ రెడ్ బుక్ తరహాలో రామకృష్ణారెడ్డి–మనోజ్ రాజ్యాంగంలో పాలు పంచుకుంటున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించక తప్పదని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని, అనపర్తిలో అయితే అదనంగా రామకృష్ణారెడ్డి – మనోజ్ రాజ్యాంగం కూడా నడుస్తోందని మాజీ శాసన సభ్యులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. తనని కూడా అక్రమ కేసులో చేర్చారని వంద కేసులు పెట్టినా తాను వెనుకడుగు వేయబోనని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల అండ, ప్రజా బలం ఉన్నంత కాలం రామకృష్ణారెడ్డి తనను ఏమీ చేయలేరని అన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి దాడులు చేస్తున్నారని, దీనిని మూల్యం తప్పకుండా చెల్లిస్తారని, అంతా ప్రజలు చూస్తున్నారని సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు.

టీడీపీలో వర్గపోరు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అభిరామ్

కోరుకొండ: టీడీపీలో వర్గపోరు తీవ్రమైంది. ఒకరినొకరు బహిరంగంగా దూషించుకునే స్థాయికి చేరింది. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ కుమారుడు అభిరామ్‌కు రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరికి చెందిన వర్గాల మధ్య నెలకొన్న రగడతో మరింత ఎక్కువైంది. సామాజిక మాధ్యమాల్లో దూషించుకుంటున్నారు. అంతేకాకుండా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసుకునే స్థితికి చేరారు. ఇరువర్గాల కేసులతో పోలీసులు తలపట్టుకుంటున్నారు. ఇది కోరుకొండ మండలంలో చర్చనీయాంశంగా మారింది. పెందుర్తి అభిరామ్ మంగళవారం కోరుకొండలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరిపై పలు ఆరోపణలు చేశారు. గ్రామాల్లో పేకాటలు నిర్వహిస్తూ పోలీసులు దాడి చేయకుండా కాపాడుతున్నారని, ఎక్కడైనా అరెస్టులు జరిగితే నిందితులను విడిచిపెట్టమంటున్నారని తెలిపారు. అలాగే బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని, అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. పలు ఫేక్ పత్రికల ద్వారా తప్పుడు ప్రచారాన్ని సాగిస్తున్నట్టు తెలిపారు. అలాగే పలువురు యువకులతో సామాజిక మాధ్యమాల ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇదంతా తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌పైన అక్కసుతోనే చేస్తున్నట్టు ఆరోపించారు. స్థానికంగా నివాసముంటున్న ప్రజలకు సేవ చేసుకుంటానని పెందుర్తి అభిరామ్ తెలిపారు. విద్య, వైద్యం నిమిత్తం సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు మింగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం

- ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి
- జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పెదపూడి ఉన్నత పాఠశాలలో పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి


జీఎస్టీ అవగాహన చిత్రలేఖనంలో పాల్గొన్న చిన్నారులు

పెదపూడి: విద్యార్థులు విద్యతోపాటు పోటీతత్వం అలవరుచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గాం. దీమెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు మేలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై సమాజంలో అన్ని వ్యాపార వర్గాలు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 కె.సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు, సచివాలయం కార్యదర్శి సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'గ్రామాల అభివృద్ధిలో జీఎస్టీ–2.0 పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జీఎస్టీ చాంపియన్ ఎం.నాగరత్నం పాల్గొని మాట్లాడారు. విజేతలకు బహుమతులు అందించారు.

అనపర్తి: పన్నుల సరళీకరణ వలన ధరలు తగ్గి పన్నుల్లో పారదర్శకత పెరిగి అంతిమంగా వినియోగదారునికి ప్రయోజనం కలుగుతుందని పాత ఊరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సుజాత పేర్కొన్నారు. మంగళవారం జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: రఘుదేవపురం పీఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం హెచ్‌ఎమ్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ప్లకార్డులతో నినాదాలు చేస్తు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి, జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.అమ్మాజీ, జి.శేఖర్, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

కోరుకొండ: జీఎస్‌టీ రద్దు చేయడం ద్వారా పరోక్ష పన్నుల వ్యవస్థ పునర్మితం జరుగుతుందని కోరుకొండ హైస్కూల్ హెచ్‌ఎం రామారావు రెడ్డి అన్నారు. మంగళవారం కోరుకొండ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

సైన్స్ ప్రాజెక్టు పోటీలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి

రంగంపేట: సైన్సు ప్రాజెక్టు పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించినట్టు స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన ఏసీటీ సైన్సు సెంటర్ పెద్దాపురం 2వ వార్షికోత్సవం సందర్భంగా సైన్సు ఎగ్జిబిషన్, పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రదర్శనలో కాకినాడ, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో 60కి పైగా సైన్సు ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారన్నారు. పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని బి.పూజిత రూపొందించిన జీరో వేస్ట్ సిప్ సేవ్ ప్లానెట్ ప్రాజెక్టు జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిందన్నారు. ప్రతిభ కనబర్చిన పూజితను, సీనియర్స్ విభాగంలో జడ్జిల ప్రశంసలు అందుకున్న ఎ.రమ్య, ఎం. జాహ్నవి, ఎస్.భ్రమరాంబ, సాయిప్రదీప్‌లను, ఈ ప్రాజెక్టులకు గైడ్‌గా వ్యవహరించిన పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధను పాఠశాల హెచ్‌ఎం పార్థసారథి, ఎంఈఓలు కె. శ్రీనివాసరావు, పి.మధుసూదన రావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో గొప్ప పేరు కలిగిన వ్యక్తి అన్నారు. అందుకనే ఈయనను సంస్కృత భాషకు ఆదికవిగా గుర్తించారన్నారు. రామాయణ మహాకావ్యాన్ని లిఖించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారని, ఆధునిక సమాజానికి ఆదర్శ ప్రాయంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు యంబీఎస్.మురళీకృష్ణ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయంలో..

పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత వాల్మీకి జయంతిని స్థానిక కోటగుమ్మం వద్ద నున్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రారాజు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఐటీ వింగ్ సత్తిబాబు, కార్యాలయ సిబ్బంది రాధాకుమారి, సురేఖ, శైలజ, సుందరి, కామేశ్వరి, శిరీష, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం మాట్లాడుతూ రాముడ్ని ఆదర్శమూర్తిగా చూపి భారత సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువుటద్దంగా రామాయణాన్ని వాల్మీకి రచించాడన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బోను రామకృష్ణ, కే.శివరామకృష్ణ, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పాఠశాల అవార్డు అందుకున్న హెచ్‌ఎం


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం శ్యామలాదేవి

సీతానగరం: రఘుదేవపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వచ్ఛ పాఠశాల అవార్డును హెచ్‌ఎం ఎం.శ్యామలాదేవి అందుకున్నారు. రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా స్వచ్ఛ పాఠశాల అవార్డును ఆమె అందుకున్నారు. జిల్లా స్థాయిలో రఘుదేవపురం పీఎంశ్రీ జెడ్పీహెచ్ స్కూల్ అవార్డు గెలుచుకోవడంతో పలువురు హర్షం వ్యక్త చేశారు.

ఆసుపత్రి, హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

కంబాలచెరువు: ప్రభుత్వ ఆసుపత్రి, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. రోగులు వైద్య పరీక్షలకు బయటకు వెళ్లే పనిలేకుండా అన్ని పరీక్షలు ఆసుపత్రిలో జరిగేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో విద్యార్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన


వీసీని కలసిన అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: యువత వినియోగదారులుగా తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడం అత్యంత అవసరమని ఆదికవి నన్నయా యూనివర్సిటీ అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్నశ్రీకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం యూనివర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న మార్కెట్ వ్యవస్థలో విద్యార్థులు జాగ్రత్తగా, చట్టపరంగా అవగాహనతో ఉండాలని అందుకు అవసరమైన అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో వినియోగదారుల అవగాహన సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులలో చట్టాలు, న్యాయపరమైన అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి


సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

పెదపూడి: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల డే సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సంపర, పెద్దాడ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఆరోగ్యకేంద్రంలో అందజేశారు. ఆశ వర్కర్లకు పని భారాన్ని తగ్గించాలని, సెలవులు ఇప్పించాలని, మట్టి ఖర్చులు జీవో వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ ధర్నాకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల జిల్లా నాయకురాలు పద్మ, మండల నాయకులు కె.వీరలక్ష్మి, వల్లూరి ఉమావతి, జి. ఈశ్వరమ్మ, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

- మానసిక ఆరోగ్య కౌన్సిలర్ విజయసురేష్
- పాఠశాలల్లో మానసిక ఆరోగ్య వారోత్సవాలు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయసురేష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ఉత్తమ విద్యను అందుకోగలరని జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ కె.విజయ సురేష్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆల్కాట్‌తోటలోని శ్రీనివాసరామానుజ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని సత్యవతి అధ్యక్షతన విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, ఒత్తిడిని జయించడం, భావోద్వేగాల సమతుల్యత తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలని, సరైన నిద్ర ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులు తమ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, నమ్మకమైన స్నేహితులను ఎంచుకోవాలన్నారు. జ్ఞాపకాలు, కృతజ్ఞతలను రాసుకునేలా చిన్న డైరీ అలవాటు చేసుకోవాలని విజయ సురేష్ వివరించారు. హెచ్‌ఎం సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ అన్నింటిలోనూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అటవీ అధికారులతో సమావేశం

కడియం: భారీ వృక్షాలను రీప్లాంటేషన్ చేసే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)తో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. కడియపులంకలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో జరిగే సమావేశానికి రైతులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.